# సౌందర్యము

శ్రీమతి యు. సత్యబాలసుశీలాదేవిగారు

౧

జ్యోతీశ్ చిన్నపల్లెటూరిజమీందారు. కలకత్తాలో వుంటున్నాడు. చదువు, చక్కదనం, ధనం, గుణం ఎందునాకూడాలోపంలేదు. తగినగృహిణికావాలని అతనికింకాప్రబోధంకాకుండానే- లోచకపోవడం అనేనెపంతో హృదయం వెతుక్కుంటూన్నది. ఒకనాడు జ్యోతీశ్ యౌవనప్రభంజనంలో లలితాసౌందర్యసుగంధం మందగమనంతో వచ్చేసియాతని ప్రేమహృదయం చలింపజేసింది. తండ్రివున్నప్పుడు లలితారాణి క్రిందపడితే అరిగిపోయ్యేది. అప్పుడు ఆమె లక్షాధికారికూతురు. ఇప్పుడో సామాన్యసోదరి. తల్లిఎంతోగారాబంగాచూసుకుంటున్నా ఆనాకట్లు, ఆపట్టుదుస్తులు, ఆరత్నాభరణాలు ఇప్పుడేవీ? అయినా ఆచూపుల్లో అమాయికపు చలనము, ఆగులాబీపెదవుల్లో చిరునవ్వువెన్నెలా, ఆకంఠధ్వనిలో మాధురీప్రవాహం, ఆపచ్చనిశరీరంలో ప్రవహించే విద్యుత్కాంతి అలాగేవున్నవి. వచ్చీరానినేర్పుతో అల్లిబిల్లిగా అల్లుకున్నజడ, పిల్లవాయువుల్లో తేలిపోతూన్న ముంగురుల్లో మెరిసే కుంకుమబొట్టు, పాముకుబుసంలాగు పాదాలుదిగి జీరాడుతూన్నగులాబీచీర, బాహువల్లరి సౌందర్యం ద్విగుణీకృతంచేస్తూన్న నీలిపట్టురవికా, చేతులకు రెండేసిగాజులు, మెడలో చిన్నముత్యాలదండ, చెవులకు చిన్నరవ్వకమ్మలు. ఇంతే యిప్పటి యీమెముస్తాబు. పెంపుడుకుక్క వెంటనడుస్తూంటే పెంపుడుచిలకను చేతులో పెట్టుకొని వచ్చి తోటమధ్యవున్నగచ్చుఅరుగుమీదకూర్చుని అవ్వేళే అన్నదగ్గరనేర్చుకున్న ఇంగ్లీషుపద్యం చిలుకకునేర్పుతూన్న ఆదృశ్యంచూచి జ్యోతీశ్ చూపుమరల్చుకోలేకపోయ్యేడు. మీచెల్లెలిని చూడాలనేభావం సురేంద్రుడిదగ్గర కనబరచేడు. చెల్లెలిఅదృష్టానికి సురేశ్ పొంగిపోయ్యేడు. సురేంద్రుడితోట జ్యోతీశ్ మేడమీదికి బాగాకనబడుతుంది. సంపదంతాతండ్రితో పాటుగతించినా ఆతోట- ఆమేడ- కొద్దిగా ఆస్తిమాత్రం నిలబడ్డవి.

౨

ఆవేళకు తిరిగివస్తానుగదాఅని గ్రామాంతరం వెళ్లిన సురేశ్ కార్యాంతరాలవల్ల రాలేకపోయ్యేడు. ఆసాయంత్రమే జ్యోతీశ్ లలితని చూడ్డానికివస్తాడని లలితతల్లి ఆమెనుముస్తాబు చెయ్యడం మొదలెట్టింది. లలితకు యింతవరకూ అవసరంలేకపోవడంవల్ల ప్రత్యేకమైన విలువగలదుస్తులుగాని, వస్తువులుగాని లేవు. చూడ్డానికివచ్చేది జమీందారు. తన కూతురు తగినఆడంబరంగాలేకపోతే ఆమెకేమీబాగోలేదు. తనచిన్ననాటివస్త్రాభరణాలన్నీ బయటికితీసింది. ఆసుందరి ముఖాననాట్యమాడుతూండే ముంగురులన్నీ పైకిదువ్వేసి ఏడుస్తూన్నకొద్దీ సాధ్యమైనంతగట్టిగాబిగించి జడేసింది. ఆపైన ఆజడలో కొన్నివస్తువులు కూర్చి జడకనబడకుండా పువ్వులుకూర్చేసింది. ముక్కుకి ఆవిడపెట్టుకున్న నత్తు, బేసరీలు పెట్టింది. చెవులకేవో తగిలించింది. చంచలమైన యీపెద్దకళ్లకి దట్టంగాకాటుకపెట్టి

తిలకందిద్దింది. చూస్తేభయమేస్తోంది. ఆఎర్రరంగు! ఆచెమ్కీపని! ఆలేసుకుచ్చులూ! అంతపెద్దది! ఆజాకెట్టులోడిగి దానికనుగుణంగా నిండుఊదారంగుబనారసుచీరకట్టించింది. ఆపైతనకున్నవస్తువులన్నీ ఎంతవదులైనా, ఎంతబరువైనా, ఆపిల్లఎంతఏడ్చినా—కంకణాలు, కాలిగొలుసులుకొన్నిజతలు, వడ్డాణము, మెడలోకాసులదండలు, వరహాలదండలు ఏవేవో అన్నీతగిలించింది. అయిదుగంటలుకొట్టగానే లలితాసుందరరూపం హృదయంలో చిత్రించుకుంటూ జ్యోతీక్ వచ్చేడు. కాబోయేఅల్లుడురాగానే ఏమిమాట్లాడాలో, ఎలా మర్యాదచెయ్యాలోనని వేసికున్నప్లానంతా తాత్కాలికహృదయావేగంలో కలిసిపోవడంవల్ల వచ్చిన పదినిమిషాలకి అత్తగారు అల్లుణ్ని కూర్చోమనిమాత్రం చెప్పగలిగింది. "ఇదేమిటి! ఈవేషమేమిటి! ఆలలితే ఈలలితేలాగ? సురేశ్ ఏడీ? అంతామోసం. సౌందర్యం భ్రమ. దూరపుకొండలునునుపు." జ్యోతీక్ తలతిరిగిపోతూన్నది. కొంతసేపటికి లలితకన్నీళ్లతో కలసినకాటుక మొహమంతాఅలుముకుంటూతలెత్తి జ్యోతీక్ వేపుచూసింది. తిరస్కారకోపసమ్మిళితంగా నవ్వుకుంటూ జ్యోతీక్ లేచినిలబడ్డాడు. లలిత బంధంవిడిపించుకున్న లేడిపిల్లలా పరిగెత్తింది. మరునాడు సురేంద్రుడువచ్చి సంగతేంటోకనుక్కోవాలని స్నేహితుడిదగ్గరకువెళ్లి నిన్నతానులేనందుకు క్షమాపణకోరుకున్నాడు. జ్యోతీక్ ఉదాసీనతచూచి భయపడుతూ మెల్లగా ఆవిషయంప్రస్తావించేడు. జ్యోతీక్ పెద్దగా ఊపిరితీసుకొని ఆవిషయమై ఆలోచించడానికి. సమయంకావాలనిఅడిగేడు. ఆమాటతో సురేశ్ సెలవుతీసికొని లేచేడు. ఇంటికి వెళ్లుతూ ఇతడెక్కడో చపలచిత్తుడిలాగున్నాడు అనుకున్నాడు.

## 3

అవ్వేళసాయంత్రం జ్యోతీక్ షికారుకుపోలేదు. పరధ్యానంగా సురేశ్ తోటవైపుగా పిట్టగోడదగ్గరనిలబడి అర్థహీనంగాచూస్తున్నాడు. వయ్యారంగా వనలక్ష్మిలాగ తవళ్వన శుకాలలో లలితవస్తోంది. అరే! ఏమిటీగోల? మొన్నఆవేషం! ఇవ్వాళఈవేషం! జ్యోతీక్ ఉలికిపడి సర్దుకున్నాడు. గుండెవేగంగా కొట్టుకుంటున్నది. ఆమె వచ్చేసి ఆఅరుగుమీదే ఆలాగే కూర్చుని చిలక్కిచెప్పినపద్యం వప్పచెప్పుకుంటూన్నది. ఈసమస్య ఎలాగనిర్ణయించడం? మళ్లా వాళ్లయింటికెళ్లిచూస్తే అలాగేకనబడుతుందేమో. ఎమన్నాకానీ అనుకొని తిన్నగతోటలోకివచ్చేసి కాస్తదూరంలోనుంచుని ఆనిర్మలసౌందర్యం తనివిదీరా తిలకిస్తూన్నాడు. దూరపుచూపులుగావు. నాఅవివేకం అనుకున్నాడు. ఆవిడకట్టుకున్న పసుపుపచ్చజరీచీర సంజకెంజాయతోకలసి ఆమెకు మరింతసౌందర్యంగూర్చింది. ఆపొట్టిచేతుల తెలిపట్టురవికలోంచి దుముకుతూన్న ఆశరీరకాంతిచూచితీరాలి. ఆవిడలేచిక్రిందపడిపోయిన చేరుమాలందుకుంటూంటే జ్యోతీక్ కనబడ్డాడు. ఇప్పు డాచూపులు జ్యోతీక్ హృదయాన్ని కలతబెట్టేశాయి. ఈచక్కదనం ఎక్కడుంచేమాత్రం ఏలాదాగుతుంది? మళ్లీ అవ్వేళటి వేషం ఈవేషంపోల్చుకునేప్పటికి జ్యోతీక్కునవ్వాగలేదు. అవ్వేళటివేషాడంబ 470 ఈచంద

మామను కమ్మేసింది. సురేశ్ ను అన్యాయంగానొప్పించేను, ఇప్పుడే వెళ్లి ప్రాయశ్చిత్తంచేసుకోవాలనుకున్నాడు. లలిత అప్పటికే మెరుపులామాయమైపోవడంవల్ల మరి ఉండాలిసిన అవసరంలేకపోయింది. శరవేగంతో సురేశ్ దగ్గరకువెళ్లేడు. జరిగిందంతాచెప్పేసి యిదంతా మీయమ్మగారి అలంకరణాచాతుర్యఫలితం గనుక నన్ను క్షమించవలసివుంటుందన్నాడు. సురేంద్రుడికికూడా నవ్వాగిందికాదు. ఇంతలో తోట్లోంచిబయలుదేరిన లలిత దాదా! అనిపిలుస్తూ గుమ్మందాకావచ్చి జ్యోతీక్ కనబడగానే అతనివైపు తీక్ష్ణంగాచూస్తూ గిరుక్కునతిరిగి వెళ్లిపోయింది. స్నేహితులిద్దరు ఒకరిమొహం ఒకరుచూసుకు నవ్వుకున్నారు. కొంతసేపు మాట్లాడి జ్యోతీక్ వెళ్లిపోయాడు. పర్యవసానం ఏవిటంటే వారంరోజులకు లలితాజ్యోతీంద్రులపెళ్లి! ఆవేళనుండి లలిత తోట్లోకిపోవడం మానేసింది.

## మల్లెపూవులకథ

అధికార్ల సూర్యనారాయణరావుగారు బి.యల్.

మాపేరుమల్లెలు మాయింటిపేరు
పూలవారనుచెల్లబాలలంటారు;
సిరిసంపదలు మాకుబరువుగాలేవు,
ధన మింతగంధంబు ధవళకాంతులును.
నెలతలందరమేము నిత్యమల్లెలము,
బొండుమల్లియలెల్ల పురుషులుమాకు,
సన్నజాజులును మాజాతిలోవారె,
చంచరీకములు మాసావాసకాండ్రు.
భోజనంబులు మాకు భూమిసారంబు,
ఆలయంబులు మాకు ఆకుజొంపములు,
శుభకార్యములు మాకు కళ్యాణవిధులు,
అనురాగమే మాకు హాయైనగాలి.
గాలిలోజనియించి, గాలిలోపెరిగి,
గాలిలోపెండ్లాడి, గాలిలోవలచి,
గాలిలోవికసించి, గాలిలోవాడి,
గాలిలో జీవాలు గడుపుకొంటాము.
వాసంతుడే రాజు, వనమె రాజ్యంబు,
వేవెల్గు, రేవెల్గు కావలయువారు,
నవ్వుమోములె మాకు నగలునాణెములు
మందయానలజడల్ మావాహనాలు.

శుభకార్యములు మేము చూడనివిలేవు,
కళ్యాణములు మేము గాంచనివిలేవు,
శోభనాల్జేసేము, సుఖములిచ్చేము,
పండుగులబాలించి ప్రతిభగన్నాము.
పూజాపురస్కారములలోన మేమె
పనులన్నియుంజేసి పాటుపడతాము!
కట్నాలుకానుకల్ ఘటియించువేళ
సద్గుణంబులుమేమె సాటిచెపుతాము.
సారెలో సిగ్గుచే జంకుజవ్వనికి,
అత్తవారింటిలో క్రొత్తకోడలికి,
దయితునిరాకకై తపియించుచెలికి
ఆనందమొనగూర్చి అభయమిస్తాము.
చిట్టిసొగసుకు మాకుపెట్టిందిపేరు,
మైత్రియందరితోడ మాయొక్కతీరు,
మనియుండినన్నాళ్లు మర్యాదసెడక
కాపాడుకొనుచుండి కళ్లుమూస్తాము.
మేమున్న అందరూ ప్రేమించుతారు,
ప్రజలప్రేమముకన్న భాగ్యమేముంది?
హాయినించుటయె మాకానుపావనము,
నెనరుబెంచుటయె మానిత్యజీవనము.